25 నుంచి శృంగేరి శారదా శంకరమఠం వార్షికోత్సవం

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి జగద్గురు మహాసంస్థానం, శ్రీ శృంగేరి శారదా శంకరమఠం 25వ వార్షికోత్సవం ఈ నెల 26 ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. ప్రత్యేక పూజలు 30వ తేదీ వరకు జరగనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సీఎస్ ఆర్ మూర్తి ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. మొదటిరోజు ఆదివారం ఉదయం 7 గంటలకు గురువందనం, గురుపాదుకా పూజ, శ్రీ ఆది శంకరాచార్యుల అష్టోత్తర శతనామార్చన, గణపతి పూజ, కలశస్థాపన, ఋత్విక్ వరుణం, ఉదయం 10 గంటలకు శ్రీ లక్ష్మీ గణపతి హోమం వంటి ప్రత్యేక కార్యక్రమాలతో ఈ కార్యక్రమాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

ఆర్థిక సహాయం



రామయ్యకు ఆర్థిక సహాయం అందజేసిన వీరూ యాదవ్

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌లోని శ్రీరామ్‌నగర్‌లో నివసించే నిరుపేద కుటుంబానికి చెందిన రామయ్య అనే వ్యక్తి ప్రమాదవశాత్తు యాభై శాతం చర్మం కాలిపోయింది. శనివారం రామయ్యకు బీఎస్‌వీవై ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ బీఎస్ వీరూ యాదవ్ 20 వేల రూపాయలు అందజేశారు. ఆయన కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారికి పూజలు



పూజలు చేసిన పండాల సతీష్ గౌడ్

బాలానగర్: ఫతేనగర్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శనివారం అమ్మవారి జన్మదినం సందర్భంగా ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రామయోగి గుప్తా, వీరేశం గుప్తా, నాగేష్ గుప్తా, వాసు గుప్తాలు పాల్గొన్నారు.

ఈటల గెలుపు ఖాయం



ఈటలను కలిసిన పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ నాయకులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఎంపీ ఈటల గెలుపు కోసం కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలు, బూత్ ప్రెసిడెంట్లు, బూత్ ఇన్‌చార్జిలు శనివారం శామీర్‌పేటలోని రాజేందర్ నివాసానికి వెళ్లి భారీ మెజార్టీతో గెలవబోతున్నారని ముందుగా శుభాకాంక్షలు తెలిపారు.

మోదీ మళ్లీ ప్రధాని కావాలని...



బద్రీ నారాయణస్వామిని దర్శించుకున్న మహేందర్ తదితరులు

మోతీనగర్: దేశ అభివృద్ధి కోసం మరోసారి నరేంద్ర మోదీ 400 పైగా స్థానాల్లో గెలిచి ప్రధానమంత్రి కావాలని, మల్కాజిగిరిలో బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అత్యధిక మెజార్టీతో గెలవాలని కోరుతూ మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ శనివారం బద్రీనాథ్‌లోని బద్రీ నారాయణుడిని దర్శించుకున్నారు. బద్రీ నారాయణుడిని దర్శించుకున్నవారిలో రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు మల్లేష్ గౌడ్, మూసాపేట డివిజన్ జనరల్ సెక్రటరీ ఎర్ర స్వామి, స్నేహపురి కాలనీ సెక్రటరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


త్రోబాల్ అసోసియేషన్ భేటీ



సమావేశంలో పాల్గొన్న జగదీష్ యాదవ్, సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: ఎల్‌బీ స్టేడియంలోని ఒలింపిక్ భవన్‌లో తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఒలింపిక్స్ కార్యదర్శి జగదీష్ యాదవ్, తెలంగాణ త్రో బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, నేషనల్ గేమ్స్ ఆర్గనైజింగ్ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం హాజరయ్యారు. జూన్‌మొదటి వారంలో జరగబోయే 47వ సీనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌కి సంబంధించిన కార్యాచరణపై చర్చించారు.

ప్రత్యేక పూజలు



ఆల్విన్‌కాలనీ: కేపీహెచ్‌బీకాలనీలో వేంచేసియున్న శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జన్మదినం పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ చెరుకు కుమారస్వామి దంపతులు ఈ పూజా, హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి భక్తులు విరివిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు.



వారు కళ్లు మూసుకుంటారు.. వీరు కన్నేస్తారు!

- కబ్జాదారుల ఆక్రమణలతో కుంచించుకుపోతున్న నాలాలు
- పట్టించుకోని అధికారులు
- చిన్నపాటి వర్షాలకే కాలనీలు జలమయం
- కనిపించని రక్షణ గోడలు
- అక్రమ నిర్మాణాలపై చర్యలు శూన్యం



అక్రమ నిర్మాణాలతో కుంచించుకుపోతున్న నాలా





ఆల్విన్‌కాలనీ: అధికారులు కళ్లు మూసుకుంటారు.. కబ్జాదారులు కన్నేస్తారు.. అంతే... నాలా లేవో కబ్జాలకు గురవుతాయి. రోజురోజుకూ కుంచించుకుపోతాయి. వర్షాలు వచ్చినప్పుడు పొంగిపొర్లుతాయి. జనం నీట మునిగి అల్లాడిపోతారు. ఇదీ కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో గొలుసుకట్టు చెరువులకున్న నాలాల దుస్థితి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు నాలాలకు ఇరువైపులా కంచెగోడలు ఏర్పాటు చేసి కబ్జా కాకుండా చూడాల్సిన అధికారులు వాటిపై కన్నెత్తి చూడటంలేదు. ఇదే అదనుగా భావించిన కబ్జాదారులు నాలాల ఇరువైపులా భారీ అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆమ్యామ్యాలు అందటంతోనే అక్రమ నిర్మాణాలను పట్టించుకోకుండా చోద్యం చూడటంతో నాలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు వాపోతున్నారు.

ఈ చెరువుల కింది నాలాలు ఇంతేనా...

ప్రగతినగర్ అంబీర్ చెరువు, కిందికుంట చెరువు, పరికి చెరువు, ఎల్లమ్మ చెరువు, ప్రాంతాల్లోని నాలాలు కుంచించుకుపోవటంతో చెరువులోని నీటితోపాటు వరదనీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నీరు సాఫీగా ప్రవహించడంలేదు. దీంతో భారీవర్షాలు కురిస్తే ఆ చుట్టుపక్కల ఉన్న కాలనీలన్నీ నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. గత వర్షాకాలంలో ప్రగతినగర్ అంబీర్ చెరువు పరిసర ప్రాంతాలు, పరికి చెరువు పరిసర ప్రాంతాల్లోని ఆల్విన్‌కాలనీ, ధరణినగర్, చక్రధర్ నగర్ కాలనీ వంటి తదితర కాలనీలో నీట మునిగాయి. బోట్లను వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

చేతులు దులుపుకున్నారు అంతే..

ప్రజా ప్రతినిధులు ఈ ప్రాంతాల్లో నీట మునిగిన వారిని పరామర్శించి చేతులు దులుపుకున్నారు. కానీ, వారి సమస్యను పరిష్కరించలేదు. చెరువుల నాలాలకిరువైపులా కంచె గోడలు లేకపోవటం, నాలాలకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాలను ఆక్రమించి కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపట్టి అమాయక ప్రజలకు అంటగట్టి కోట్లను ఆర్జిస్తున్నారు. వర్షాకాలంలో వరద నీటితో ఈ ప్రాంతాలు నీట మునిగి ప్రాణాలు అరచేత పట్టుకొని గడపాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు అవసరం...

ఆల్విన్‌కాలనీ, ధరణినగర్, సాయినగర్, ఆదిత్యనగర్, వివేకానందనగర్, కమల ప్రసన్న నగర్, వేంకటేశ్వరనగర్, శ్రీనివాస నగర్, రామ్‌నరేష్ నగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ, వంటి ప్రాంతాల్లో ప్రవహిస్తున్న నాలాలకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలు గుర్తించి వారిపై చర్యలు తీసుకొని నాలాలకు ఇరువైపులా కంచె గోడలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సరిహద్దులు ఏర్పాటు చేయాలి



నాలాలకు ఇరువైపులా సరిహద్దులు ఏర్పాటు చేసి కంచె గోడలు నిర్మించాలి. కబ్జాలకు గురవుతున్న నాలా ప్రాంతాలను పరిశీలించి అధికారులు, ప్రజా ప్రతినిధులు వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రమాదం జరగక ముందే జాగ్రత్త చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

–సూర్యవంశి ప్రలిత్, స్థానికుడు

వరద ముంపు లేకుండా చూడాలి

అధికారుల సమావేశంలో జోనల్ కమిషనర్ ఆదేశం



సమావేశంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పరిధిలోని ముంపు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం జోనల్ కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ, టీఎస్‌ఎస్‌డీసీఎల్, హెచ్‌ఎండబ్ల్యూస్ అండ్ ఎస్‌బీ, ట్రాఫిక్, పోలీస్, ఆర్‌టీసీ, సీఆర్‌ఎంపీ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు, వరద ముంపు ప్రాంతాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో గత సమావేశంలో తీర్మానాల పనుల పురోగతిపై శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. పెండింగ్ పనులపై సమీక్షించి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మూసాపేట్ భరత్‌నగర్ బ్రిడ్జి నుంచి ట్రాఫిక్ పోలీసులు సూచించిన సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. అన్ని జంక్షన్‌లలో టెంపరరీ షెడ్‌లను వెంటనే తొలగించాలని, పక్కా నిర్మాణాలకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప కమిషనర్లు, అన్ని సర్కిళ్ల డిపార్టుమెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో సుకూన్ -24 ఫెస్టివల్ నిర్వహించొద్దు

స్టూడెంట్ యూనియన్‌ను కోరిన హెచ్‌సీయూ యంత్రాంగం

రాయదుర్గం: సెలవులు ఉన్నందున సుకూన్-2024 ఫెస్టివల్‌ను నిర్వహించవద్దని స్టూడెంట్స్ యూనియన్‌కు హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వు జారీ చేసింది. యూనివర్శిటీ తెరిచి ఉన్నప్పుడు విద్యార్థుల పండగ సుకూన్‌ను నిర్వహించాలని సూచించారు.ఈ మేరకు శనివారం హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ ఒక అత్యవసర ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వెకేషన్ పీరియడ్ కావడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లినందున అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన లేరని, అలాగే ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల కోడ్ జూన్ 4 వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేకంగా 13 ఆదేశాలను కూడా నిర్దేశిస్తూ ఒక ఉత్తర్వును జారీ చేశారు. దీనిని విధిగా పాటించాలని సూచించారు. విద్యార్థులందరూ క్యాంపస్‌కు తిరిగి వచ్చే తదుపరి సెమిస్టర్‌లో ప్రత్యామ్నాయ తేదీలను ప్రతిపాదించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ అధికారులు పేర్కొన్నారు.

పనిచేయని చేతిపంపులు





రాధాకృష్ణనగర్, పాండురంగానగర్‌లో పనిచేయని చేతి పంపులు

మోతీనగర్: వేసవికాలం ప్రారంభం కాగానే పలు బస్తీ, కాలనీల్లో నిరుపయోగంగా ఉన్న చేతి పంపులను రిపేర్ చేయవలసిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అల్లాపూర్ డివిజన్ రాధాకృష్ణనగర్‌లోని చేతిపంపు పాడైపోయింది. వేసవి కాలం నీటి ఎద్దడి వచ్చినప్పుడు ఆ బోర్‌లో నీటిని స్థానికులు వాడుకుంటారు. ఈ చేతిపంపును రిపేర్ చేయకపోవడంతో బస్తీ, కాలనీల్లో జరిగే శుభాకార్యాలకు, నిత్యావసరాలకు ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పేరిట నల్లానీరును అందించారు. అదే విధంగా రూపాయికి నల్లా కనెక్షన్ ఇవ్వడంతోపాటు రెండు 20 లీటర్లను ఉచితంగా అందించారు. నేడు వేసవి కాలం వచ్చినప్పటికీ ఎక్కడా బోర్‌లను రిపేర్ చేసిన దాఖలాలు కూడా లేవు. మూసాపేట డివిజన్ పాండురంగనగర్ శ్రీప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న చేతిపంపు కూడా నిరుపయోగంగా మారింది. ఇది పనిచేయకపోవటంతో భక్తులకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చేతి పంపులను బాగు చేయాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఓపెన్ డిగ్రీ పరీక్షల ఫీజు గడువు 22

మూసాపేట: ఓపెన్ డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు ఉందని కూకట్‌పల్లి ఓపెన్ డిగ్రీ కళాశాల కో ఆర్డినేటర్ రమేష్ బాబు తెలిపారు. మొదటి సెమిస్టర్ అపరాధ రుసుముతో ఈ నెల 22వ తేదీ వరకు ఫీజు కట్టుకోవచ్చని, పరీక్షలు ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు ఉంటాయన్నారు. నాలుగవ సెమిస్టర్‌కు జూన్ 19 వరకు పరీక్ష ఫీజు కట్టుకోవచ్చని, పరీక్షలు జూలై 3 నుంచి 6వ తేదీ వరకు ఉంటాయని తెలిపారు.

ఆరాధన మహోత్సవాలు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ సెకండ్ ఫేజ్‌లోని జలకన్య సెంటర్‌లోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో శనివారం శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవాలను బండోజి నరసింహాచారి, మానేపల్లి గోపిచారి, ఏఎస్‌ఆర్ రమేష్‌చారి, కమ్మరి రామకృష్ణాచారిలో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఆరాధన కార్యక్రమంలో మేడ్చల్ జీసీ సంక్షేమ సంఘం, బీసీ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు తెల్ల హరికృష్ణ, సీనియర్ ప్రాతికేయులు భాస్కర్‌చారి, సురభి రమేష్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు



జగదీశ్వర్‌గౌడ్‌ను సన్మానించిన ఆలయ నిర్వాహకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీ జగదీశ్వర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. మానేపల్లి గోపిచారి, బండోజు నరసింహాచారి, ఎఎస్‌ఆర్ రమేష్ చారి, కమ్మరి రామకృష్ణ చారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, అనిల్ రెడ్డి, సందీప్ ముదిరాజ్, వెంకట్ నాయక్, షౌకత్ ఆలీ మున్నా, నవీన్‌రెడ్డి, అనిల్ యాదవ్, నాగేష్‌గౌడ్, పోశెట్టి గౌడ్, షారూఖ్, బాబునాయక్, పదయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



స్వామి వారికి కలశాలు తెస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



స్వామి వారిని దర్శించుకున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నాయకులు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: శ్రీశ్రీశ్రీ జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 331వ ఆరాధన మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. శనివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ భవానీనగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో జరిగిన ఈ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీశ్రీశ్రీ డాక్టర్ శ్రీకాంతేంద్ర స్వామి వీరబ్రహ్మేంద్రస్వామి ఔన్నత్యాన్ని భక్తులకు చాటి చెప్పారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. వార్షికోత్సవంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు, లోహశిల్పి పిట్టంపల్లి రామలింగాచారి, కార్యదర్శి బి.సాయనాచారి, కోశాధికారి సంకోజు రవిశంకర్ చారి, గణేష్‌చారి, కాళిదాస్ చారి, శ్రీశైలం చారి, శంకర్ చారి, సాయికుమార్ చారి, బీఆర్‌ఎస్ నాయకులు కర్రె జంగయ్య, గడ్డం నర్సింగ్‌రావు, బుర్రి యాదగిరి, కుమార్, లలిత పాల్గొన్నారు.



లడ్డూలను తయారు చేస్తున్న భక్తులు



అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వాహకులు



అయ్యో... ఎంత విషాదం?

- చనిపోయిన బాలుడి ఇంట్లో మూడురోజులుగా నిలిచిన మురుగునీరు
- పట్టించుకోని అధికారులు



చనిపోయిన బాలుడి నివాసం, బయట పేరుకుపోయిన మురుగునీరు

మూసాపేట: కుమారుడు చనిపోయి బాధలో ఉన్న ఆ కుటుంబానికి మురుగు నీరు మరింత కష్టాలు తెచ్చిపెట్టింది. ప్రశాంత్‌నగర్ పరిధిలోని ఇందిరానగర్‌లోని మహ్మద్ పాషా ఇంట్లోకి చేరిన గత గురువారం కురిసిన వర్షానికి వరదనీరు వచ్చి చేరింది. వరదనీటిని తొలగించే క్రమంలో శుక్రవారం ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురైన ఆయన కుమారుడు ఇమ్రాన్ చనిపోయిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని శనివారం ఇంటికి తీసుకువచ్చారు. మూడు రోజులు గడిచినా కానీ నీరు అలాగే ఉంది. అంతేకాక ఇంటి పక్కనే డ్రైనేజీ నీరు పొంగి పొర్లుతోంది. మృతదేహాన్ని ఇంటి ముందు రోడ్డుపై ఉంచారు. ఇంటి ముందు నుంచి రాకపోకలకు వీలు లేకుండా మురుగు ప్రవాహం, దుర్గంధం వెదజల్లుతూ ఉండటంతో ఆ కుటుంబసభ్యులు నరకయాతన అనుభవించారు. మూడురోజులుగా మురుగునీటితో అవస్థలు పడుతున్నా ఆ బాధిత కుటుంబ పరిస్థితిని అధికారులు పట్టించుకోకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ సిబ్బంది వచ్చి శుభ్రం చేశారు.





వర్షపునీటి ప్రవాహం, మురుగు తొలగించేందుకు చర్యలు చేపట్టిన జీహెచ్‌యంసి సిబ్బంది